ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక (14.3.75)

# మంటలు మంటలు

"కోటిగాడొచ్చాడు దొరా!" అంతఃపురంలోకి కబురు తెచ్చాడు దేశవాళీ ఘూర్ఖా చుక్కయ్య.

"ఊఁ! అన్నాడు దొర..... దొరసాని అందించిన లేత్తమలపాకు చిలక నోటితో అందుకుంటూ.

"వెంకడి కెలాగుందంట?" దొరసాని అడిగింది.

"ఆసిపటల్లో రెండో కాలు తీసేసారంటమ్మగోరూ!"

"అయ్యో పాపం! అంత పెద్దబ్బ తగ్గిందన్నమాట!"

దొర మాట్లాడలేదు. చుక్కయ్య మాట్లాడలేదు.

"దొరగారు కాసేపట్లో వస్తారన్జెప్పు."

చుక్కయ్య వెళ్ళిపోయాడు.

"ఆఁ!.... ఏఁవిటో కథ చెప్తున్నా?"

దొర కులాసాగా నవ్వాడు.

హైదరాబాదులో స్టార్ హోటల్లో ఎయిర్ కండిషను రూమ్‌లో మిస్ పారిజాతం చెంగు లాగినప్పుడూ ఆయనలాగే నవ్వుతాడు. బెజవాడలో హైక్లాసు లాడ్జిలో సిన్మా కంపెనీ నిత్య కుమారి నీలవేణి బుగ్గ కొరికినప్పుడూ ఆయనలాగే నవ్వుతాడు. తిరుపతెళ్ళినప్పుడల్లా కొండమీద క్వార్టర్లో సూర్యకాంతం ఒంటిమీద చెయ్యేసినప్పుడూ ఆయనలాగే నవ్వుతాడు.

దొరగారి పసందైన నవ్వుల్లో తేలిపోయి వెంకడి కాలు విరిగిన సంగతి అప్పుడే మర్చిపోయింది దొర్సాని! ఆ నవ్వులన్నీ తన సొంతమేననుకుంది ఆ అసూర్యంపశ్య!

పట్టపగలే తలుపుల్దీసున్న గదిలో డన్లప్ బెడ్డు మీద కూర్చొని దొర్సాని బుగ్గమీద ముద్దోటి ముద్రేశాడు దొర. ఆ ఘాటు ప్రేమకి పరవశించిపోయింది ఆ ఇల్లాలు. ఓ మూల సిగ్గుతో ముగ్గిపోతూ.

తెరచిన తలుపుల్దగ్గర నిలబడి చూడకూడని సీను పక్కగదిలోంచి మూసిన తలుపు సందులో రెండో కన్ను మూస్కొని ఒంటికంటితో చూస్తున్నాడు చిన్నదొర. కుర్ర దొరచేతిలో ఉన్న సెక్సు మేగజైను అట్టమీది నగ్న సుందరి నామరూపాలు లేకుండా నలిగిపోతోంది!

'అబ్బ, ఏంటండీ... సరసాలు... పట్టపగలు.... అవ్వ...' మరీ గోముగా మురిసింది దొరసాని..... మగని చేతిలోని పయిటకొంగు వెనక్కు లాక్కున్నట్లు నటిస్తూ.

చూడ్డం పాపం - చూస్తున్నది మహా పాపం - అని ఎక్కడో ఎవరో అరుస్తున్నారు. అయినా పాపం చేయటంలో ఎంత మజా ఉంది. ఎంత థ్రిల్లుంది! గుబ గుబలాడే గుండె చేతబట్టుకొని ముందేం జరుగనుందో అని చూస్తూ వణికిపోతున్నాడు. ఇంకా ఏదో జరగాలని వణికిపోతూ చూస్తున్నాడు చిన్నదొర. చిన్ననాడు పాలుత్రాగిన తల్లిరొమ్ములోనే సెక్సు చూస్తున్నాడు.

వెంకడు కొడుకు కోటిగాడికి వయస్సుకి మించిన తెలివుంది..... కట్టుతాడు లేకుండా తాడిచెట్టెక్కి ముంజెలు దించటంలో - ఒంటెద్దుతోటే మెట్టపొలం దున్నటంలో.

కామయ్యపంతులుగారి కిష్టయ్యకి వయస్సుకు మించిన తెలివుంది.... చదువుకున్న చాలామందికి తెలియని లెక్కలు కట్టి పంచాంగం చెప్పటంలో - చెయ్యి తిరిగిన వాళ్ళక్కాని పొసగని పెద్ద పెద్ద పద్దులు రాయటంలో.

మరి పెద్దొరగారి పుత్రరత్నానికీ వయస్సుకు మించిన తెలివుంది. ఎక్కడలేని సెక్సు బుక్సు చదివి పారేయటంలో, మనస్సులో మక్కువైన ఆడవాళ్ళతో సురభోగాలనుభవించటంలో.

చిన్నదొర వయస్సులో చిన్న. పొగరులో పెద్ద. విన్నది తక్కువ. గ్రహించిందెక్కువ. అనుభవాలు కొన్ని. అనుభూతులు బోల్డన్ని.

మేడముందు ముంగిట్లో మందు వేసవిలో మబ్బు తునక్కోసం ఎదురుచూస్తున్నట్లు కూర్చున్న కోటిగాడి గుండెల్లో కుంపటి మండుతోంది.

ఎవరు అంటించుకున్న మంటలు వారినే దహించటం న్యాయమూ, సబబూను.

ఒకరివల్ల అంటుకున్న మంటలు వారినే కాకుండా పరిసరాలలోని వాళ్ళను కూడా దగ్ధం చేయడం సహజమూ, సంభవమూను.

కాని, ఒకరిలో రగిలిన మంటలు వారినేం చేయకుండా మరెవరినో దారేపోయే దానయ్యని బుగ్గిపాలు చేయడం ఇక్కడే జరిగింది.... ఈ మధ్యనే జరిగింది.

అసలేం జరిగిందంటే -

ఆ మధ్య పట్నం వెళ్ళివచ్చిన అప్పలరాజు "నీ అందవేఁ నాకుంటేనా - పదిమంది ఆడోళ్ళు కాన్దబ్బు ఖర్చు లేకుండా నా గుమ్మంలో పడుండేవోళ్ళు సిన్దొరా!" అని క్రొత్త క్రొత్తగా తన అనుభవాన్ని వర్ణించి చెప్పాడు.

చిన్దొర గుండె గుభేల్మంది.

"బూతు కబుర్లు సెపుతున్నా ననుకుంటున్నావా సిన్దొరా! పొర్పాటు పడ్మోక. అసల్సంగతేటంటే మొగోడ్కి ఆడ్డి కావాల. ఆడదాన్కి మొగోడు కావాల. మరి బూతన్కుంటే ఈ జెనవంతా ఏఁవైపోవాల? మరేం బయపడ్మోక - నాత్రోల్పోతే నీకే తెలుత్తుంది ఎవ్వారమంతా... అందాకా ఈ పుత్తకం సద్వు..."

చిన్దొర ఒళ్ళంతా ఆవిర్లెత్తిపోయింది.

అప్పల్రాజు సలహా అక్షరాలా పాటించాడు. అవన్నీ బూతు కథలు. అవి చదవటం తప్పని ఎవ్వరూ చెప్పలేదు. చెప్పకపోయినా అందులో ఏదో తప్పుందని అనుకున్నాడు. అనుకుంటూనే రహస్యంగా అన్నీ చదివేశాడు. 'చాటుమాటున తప్పు చేయటంలో ఎంత హాయి వుంది" అని కూడా అనుకున్నాడు చిన్దొర.

"నాన్సెప్పేవన్నీ కట్టుకతలనుకోమోక, ఇవరాలు తెలిత్తె నీకే ఎరికవుతది. పూజార్లమ్మాయి మిస్నికుట్టు సాయిబుతో ఎంద్కులేసిపోయింది? ఏడాద్నించి మిల్టరీ రంగడు గాడు ఉత్తరాదికిపోతే అచ్చమ్మ ఈ నెల్లో ఆడకూతుర్నెలా కంది? చౌదరిగారి రెండో పెళ్ళాం... నవ్వుతాలక్కాదు సిన్దొరా! ఇలాంటి కబుర్లు సెప్తే నాన్నోటి దూల గాణ్ణనుకుంటున్నావేమో నువ్వు. నాన్సెప్పేవొన్ని నిజాలు. పచ్చి నిజాలు సెప్పటాన్కి బాగుండవు కాని... నీకే తెలుత్తుందిగా కొన్నాళ్ళుపోతే..." అని కిసుక్కున నవ్వాడు అప్పల్రాజు.

అప్పల్రాజు శపించనూ లేదు, దీవించనూ లేదు. అయినా హఠాత్తుగా ఓ పూట ఆ అనుభవం ఎదురవనే అయింది. చౌదరిగారి రెండవ పెళ్ళాం ఇదివరలో ఏమేం చేసిందో అప్పల్రాజు చెప్పలేదు కాని, ఆ పూట చిన్దొరని మాత్రం ఏదేదో చేసేసింది.

ఓ రోజున పనివాళ్ళమీద నమ్మకం లేక ఎదిగొస్తున్న కొడుక్కి తర్ఫీదిచ్చినట్టవుతుందని దొర ఏదో లెక్క చౌదరికిచ్చి రమ్మని కొడుకుని పంపాడు. అంతకుముందే చౌదరి అర్జంటుగా

కబురొచ్చి చుట్టాలూరికి వెళ్ళాడు. ఆయన రెండో భార్య కుఱ్ఱాడిచ్చిన నోట్లు నోటితో లెక్కపెడుతూ.... కళ్ళతో అతని వయస్సు లెక్కపెట్టింది.

రాక రాక వచ్చావు కుఱ్ఱాడా కాస్ని కబుర్లు చెప్పిపో అంది. నేతి లడ్డూలు తెచ్చి పెట్టింది. ఆ పూట ఈనిన గేదె జున్ను తెచ్చి పెట్టింది. కుఱ్ఱాడికి బొత్తిగా తీపి నోటికెక్కలేదు. తీపి సరుకు నోటికి చేదుగా అనిపించింది. గుండెల్లో మరేదో తియ్యతియ్యగా తలయెత్తింది. చౌదరిగారి రెండో భార్య చిరునవ్వులు చిందే పెదవులు అంతదూరం నుంచే తియ్యగా ఉన్నాయి. చీర చెంగుబాటు నుంచి పాలమీగడలాంటి ఆమె పొట్ట తొనలు తొనలుగా మత్తు మత్తుగా తొంగిచూస్తోంది. ఆమె గుండెలతో పోటీ పడి అతని గుండెలు కొట్టుకున్నాయి.

చౌదరిగారి రెండో భార్య చిన్దొర వైపు కవ్వింపుగా చూసింది. కళ్ళింత చేసుకొని చూసింది. కళ్ళనిండా కాంక్ష నింపుకొని చూసింది.

అవును. చిన్దొర అప్ప్రలాజన్నట్లు అందంగా ఉంటాడు. చిన్నప్పట్నించీ తెగ తాగిన టానిక్కులన్నీ ఆ నల్లని వంకీలు జుట్టే మింగేసి తెగబలిసినట్లుంది... పట్టుకుచ్చులా మెత్తగా ఉంది. నల్లతాచు పడగలా మెరుస్తూ ఉంది. ప్రతి రోజూ ప్రొద్దున్న తినే అర్థ శేరు బాదం పప్పు ఆ బుగ్గలకే చేరుతున్నట్టుంది. ఆ బుగ్గలు పాలరాయిలా నున్నగా ఉన్నాయి. గులాబి రేకుల్లా మృదువుగా ఉన్నాయి. కమ్మని కోరికలెన్నో నింపుకున్న పెద్ద పెద్ద ఆ కళ్ళు ఆత్రంగా చిత్రంగా మిలమిల లాడాయి. అందనిదేదో రుచి చూసినట్లు గుండెల్లోంచి పొంగి వస్తున్న దాన్ని పళ్ళ సందున అదిమి పెడుతున్నట్లు ఎర్రని ఆ పెదవులు అల్లనల్లన అదిరాయి.

ఒక్కసారి ఆ అందాలన్నీ పుక్కిటపట్టి గొంతు నింపుకోవాలనుకుంది చౌదరిగారి రెండో భార్య... నీ నెత్తిమీద ఏదో ఉంది తీసేస్తానంటూ ఉప్పెనలా మీదకు ముంచుకొచ్చింది. కుర్రదొర తలమీద లేని దాన్ని తీసేస్తూ నాజూగ్గా అతన్ని ముఖాన్ని తాకుతూ తనకున్న పయ్యెద కాస్తా జారవిడిచేసింది.

ఆమె గుండెల లోతులు చూసిన చిన్న దొర గుండెలు గుబగుబలాడాయి. అప్ప్రలాజిచ్చిన బూతు పుస్తకంలో పచ్చి పచ్చిగా వర్ణించబడిన దృశ్యం కళ్ళముందుకి కత్తిలా దూసుకువచ్చింది.

చిన్నదొరకి గొంతు పిడచకట్టిపోయింది....

చిన్న దొరకి పెదవులు పొడారిపోయాయి....

చౌదరిగారి రెండో భార్య ఏదో కూసింది. ఏదేదో చేసింది. మురిపంగా ముద్దు ముద్దుగా తిట్టింది, మత్తెక్కిపోయిన దాన్లా కుఱ్ఱదొర కంఠాన్ని కావలించుకొని ముద్దులతో అతని ముఖాన్ని ముద్ద చేసి పెట్టింది. తన గుండెలకేసి నొక్కేసుకుంది.

ఆ ఒంపుల మీద ఒత్తొత్తి ఉక్కిరిబిక్కిరి చేసేసింది. మాటామంతీ లేని చిన్దొర మరేమయి పోయేవాడో కాని, ఇంతలో గేటు దగ్గర ఎవరో వస్తున్న చప్పుడవడంతో ఆ రంగం అలా ముగిసిపోయింది.

మళ్ళీ అలాంటి అవకాశం రాలేదు. పెద్దొర మరేపని మీదా చౌదరింటికి పంపలేదు.

చౌదరి గారి రెండో భార్య మరేవంకనా పిలిపించుకోలేదు. చిన్దొరకి పిచ్చెక్కిపోయింది!

అప్పలరాజు నెరుసు ముట్టించాడు. చౌదరి పెళ్ళాం ఊదరగొట్టి వదిలిపెట్టింది. ఇంకేముంది - చిన్నదొర గుండెల్లో, నరనరాల్లో రక్తమాంసాల్లో క్రొత్త క్రొత్త మంటలు కొన్ని వేలు నాలుకలు చాచుకొని స్వైర విహారం చేశాయి. ఏదేదో అయిపోయేలా చేసేశాయి. ఏదోటి చేసెయ్యమని త్రోశాయి. ఎలాగో త్రోసుకుపొమ్మని పోరాయి.

మళ్ళీ చౌదరిగారి రెండో భార్య కళ్ళ పడాలని నానా అవస్థలు పడ్డారు చిన్దొర. ఓసారి చౌదరి యముళ్ళా గుమ్మంలో కూర్చున్నాడు. మరోసారి వాళ్ళ పాలేరు యమకింకరుళ్ళా ఇల్లు పట్టుకు వ్రేలాడాడు.

అప్పర్రాజు చెప్పే సలహాలంటే సరదా పడ్డాడే కాని - అడిగి చెప్పించుకోవాలంటే చెడ్డ సిగ్గయింది చిన్దొరకి... అందుకనే, సొంత 'ఎక్స్‌పెర్మెంట్స్' చేయడం మొదలుపెట్టాడు.

ఒకరోజున తన గది తుడవడానికి వచ్చిన మాలక్ష్మిని వణికే చేతుల్తో గట్టిగా పట్టుకున్నాడు చిన్దొర. "ఏదో పరాచికం" అనుకుంది మాలక్ష్మి... అవును... చిన్దొరకి దాని మీదంత చొరవుంది. స్వతంత్రం వుంది. చిన్దొర పుట్టినప్పట్నించి ఆ యింట్లో పని చేస్తోంది. మాలక్ష్మి - ఎత్తుకు మోసింది. నీళ్ళోసింది. షోకు చేసింది. పేచీలు తీర్చింది. ఎన్నో ముద్దులు పెట్టింది. మరెన్నో ముద్దుల్తీర్చింది.. చిన్దొరని తర్వాతెప్పుడో తనకు పుట్టిన కూతురుకన్న ఎక్కువగా చూస్కుంది మాలక్ష్మి. చిన్దొర తన కెరుక లేనివాడు కాదు "ఎట్టి ఏసాల వోడు కాదు"... వున్నట్టుండి ఆ వేళ అలా చేసిన చిన్దొర నెత్తిమీద ఏ దెయ్యం తాండవిస్తోందో ఆ కళ్ళల్లో ఎట్టజీర చక్కగా విప్పి చెప్పింది మాలక్ష్మికి.

చాచి లెంపకాయ కొట్టలేదు. నేల కరుచుకునేలా ఈడ్చి తన్నలేదు... చిన్దొరని పట్టి పట్టి చూసింది. క్రొత్త క్రొత్తగా చూసింది.

చిన్దొర ఇప్పుడు చిన్నదొర కాదని తెల్సుకుంది. ఏళ్ళకు మించిన తిమ్మిరి చిన్దొర వొళ్ళంతా కమ్ముకుందని క్షణంలో అర్థం చేసుకుంది.

మత్తుగా మీద పడిన చిన్దొర చేతులు మెత్తగా తన చేతుల్లోకి తీసుకుంది. "నువ్వు సేసే పని తప్పు సిన్దొరా" అని చిలక్కు చెప్పినట్లు చెప్పింది. "కుర్రోడివి. ఇనకపోయేవో సెడిపోతావ్!" అని కూకలేసింది, "ఇంతప్పట్నించి నిన్నెత్తుకు మోసినా! అమ్మలాంటి దాన్ని. నా మీదనే సెయ్యేశావ్!.. మర్రొజయితే ఎంతకయినా తెగిత్తావ్!" అని తాను భయపడి అతణ్ణీ భయపెట్టింది.

చిన్దొరకి తన తప్పు తెల్సింది. అప్పర్రాజు చెప్పినట్టు అందరి ఆడవాళ్ళ మీద చెయ్యి వేయ్యకూడదని తెలిసింది. అందులో మాలక్ష్మి చెప్పాక ఎవరి మీద వెయ్యకూడదో స్పష్టంగా తెలిసింది. "తప్పయింది మాలక్ష్మీ! ఎవర్కీ చెప్పకేం? ఇంకెప్పుడూ ఇలాంటి వెధవ పని చెయ్యను" అని తన్ను తాను తిట్టుకుంటూ ఒట్టేశాడు చిన్దొర.

అయితే, ఆ మరుసటి రోజే అతని మనస్సు ఆ ఒట్టుని గట్టున పెట్టేసింది. పుట్టక పుట్టక

పుట్టింది. ఇక ఆ బుద్ధి పుడకలతో కానిపోదని చిన్దొరకి తెలియదు. అందుకనే మళ్ళీ ఆ 'వెధవపని' చెయ్యాలని మనస్సు పోరు పెట్టింది.

తెల్సినవాళ్ళ ముందు తప్పు చేసినట్లు తల దించుకున్నా, అతని కళ్ళు తెలియని వాళ్ళ చుట్టూ తెగ తిరుగుతూనే ఉన్నాయి....సాంబయ్యగారి ఎత్తుపళ్ళ వెంకటలక్ష్మి కూడా అతనికి అందంగానే కనపడ్డం మొదలుపెట్టింది. వీధి చివరి గోపయ్య కుంటి కూతురు కూనలమ్మా రంభలా కనిపించసాగింది... లోకమంతా ఆడాళ్ళ మయం. ఆడాళ్ళంతా అందమయిన వాళ్ళు. అందం ఉన్నది అనుభవించటానికి... ఆ అనుభవాలన్నీ తన సొంతం... పూర్తిగా తలకి తిక్కెక్కిపోయింది చిన్దొరకి.

పదిహేను రోజులనాడు కుప్పనూర్పిళ్ళ దగ్గర స్వయంగా అజమాయిషీ చేస్తున్న పెద్దొరకి పట్నం నుంచి ఏదో అర్జంటు కాగితం వచ్చిందని పట్టుకు వెళ్ళిచ్చి ఇంటికి తిరుగుముఖం పట్టాడు చిన్దొర. అలవాటు లేని పొలం గట్లమ్మట నడిచి వస్తున్న చిన్దొరకి డొంకల వెనకాల మడుగులో నిలువునా నీళ్ళోసుకొని బట్టకట్టుకుందామని పైకి వస్తున్న బద్రిగాడి పెళ్ళాం చటుక్కున కళ్ళబడింది.

అప్పటికే పిచ్చెక్కి ఉన్న చిన్దొర వెర్రికుక్కలా డొంక మీంచి దూకి బద్రిగాడి పెళ్ళాం మీద పడ్డాడు. ఈ పిడుగు పాటుకి అది పొలికేకలు పెట్టింది. మీద పడిన వాడెవడో తెల్సుకొని "పెద్దోళ్ళ" మర్యాద దక్కించటానికి తను ఎలాగో తప్పించుకొని తిరిగేదేమో కాని అప్పటికే దాని గొంతు దారినపోతున్న దానయ్య లందర్నీ పేరు పెట్టి పిల్చినట్లయింది.

అందరి కన్న ముందొచ్చిన వాడు వెంకడి కొడుకు కోటిగాడు. చిన్దొర వీపు విమానం మోత మోగించి చేతులు వెనక్కి విరిచి పట్టుకున్నాక కాని ఆ ఘనకార్యం చేస్తున్న మనిషి చిన్దొరని వాడికి తెలియలేదు! తెలిశాక తెల్లమొహం వేసి చిన్దొరని వదిలిపెట్టేసి, "నువ్వాసిన్దొరా" అని గుటకలు మ్రింగటం మొదలుపెట్టాడు....

'ఇంత సిన్నోడివి అంత గొప్పింటి బిడ్డవి. నీకీ బుద్దేంటి' అనేమో కోటిగాడి తాత్పర్యం! కాని, అవేం తలకెక్కేలా లేవు చిన్దొరకి. మొండికెత్తిన వాడిలా కర్రాడలా అలాగే నిలబడి పోయాడు. ఈలోగా పులిపంజా నుంచి తప్పించుకున్న లేడిలా బద్రిగాడి పెళ్ళాం మరో డొంక చాటుకి బట్టకట్టుకోటానికి పోయింది.

ఇంతలో మరో పుంజీడు జనం ఏమిటేమిటంటూ వచ్చిపడ్డారు. చిన్దొర మాట్లాడలేదు. బద్రిగాడి పెళ్ళాం మాట్లాడలేదు.... ఇద్దరి పరువు తన నోట్లో దాచుతున్న కోటిగాడు మాట్లా డాడు. "ఏం లేదురా! ఏదో పావుంన్చూసి అది బయ్యపడి కేకలేసిందంట... సిన్దొర. నాను ఏటో అని లగెట్టుకొచ్చాం, అంతే!"

చిన్దొరకి కోటిగాడి మీద పీకదాకా కోపం వచ్చింది.

వాడు రాబట్టే బద్రిగాడి పెళ్ళాం తనకు దక్కకుండా పోయింది. వాడు రాబట్టే బద్రిగాడి పెళ్ళాం దృష్టిలో తనో పోకిరీ వెధవలా తయారయిపోయాడు. వాడు రాబట్టే మేడల్లో పుట్టిన

చిన్నారకాదు మట్టిలో పుట్టిన కోటిగాడు మాణిక్యమని బద్రిగాడి పెళ్ళాం అనుకొని వుంటుంది... ఇన్ని కారణాలు కోటిగాడి మీద కోపం తెప్పించాయి చిన్నారకి. అంతకన్నా నలుగురికీ తను చేసిన పని తెల్సినా అంత కోపం వచ్చుండేది కాదు. తను పెద్దొరగారి ముద్దుల కొడుకు. తనేం చేసినా చెల్లుతుంది. ఎవడికయినా అనేందుకు దమ్ములేం ఉన్నాయి?... కాని, ఆ అవకాశం లేకుండా చేశాడు కోటిగాడు. అదే చిన్నారకి కోటిగాడి మీద కసి కలిగించింది... అందుకే వాడికి తగిన బుద్ధి చెప్పాలనుకున్నాను చిన్నార.

కుప్ప నూర్పిళ్ళయిపోవటంతో ఆ మధ్య ఆగిపోయిన పెద్దొరగారి క్రొత్త మేడ కట్టటం తిరిగి ప్రారంభించారు. అక్కడ పని చేసే చాలామందిలో వెంకడూ ఉన్నాడు. కోటిగాడూ ఉన్నాడు.

తనకు పరాభవం జరిగిన రోజు నుంచి కోటిగాడిని వెన్నంటి వెంటాడుతున్న చిన్నార మేడదగ్గరకి అజమాయిషీకి వచ్చినట్లు వచ్చాడు. అదే వారం రోజుల క్రితం అయితే... బద్రిగాడి పెళ్ళాం ఆ వేళ అలా దిశమొలతో కనపడి తన్ను వెర్రెత్తించి ఉండకపోతే, ఆ తర్వాత కోటిగాడి చేతుల్లో అవమానం జరిగి ఉండకపోతే (?),... ఇప్పుడు మేడ పనిలో, చిరుగుల గుడ్డల్లో అడుసుతో ఒళ్ళంతా అట్టలు కట్టిపోయిన ప్రతి ఆడదీ చిన్నారకి అందంతో కనపడి ఉండేది.

కాని, ఇప్పుడు చిన్నార దృష్టంతా కోటిగాడి మీదుంది. కోటిగాడి "పొగరు" అణిచేవరకు తనకు శాంతిగా ఉండదు. వాడి కాలో చెయ్యో విరిగే వరకు తన మనస్సు నెమ్మదించదు.

చిన్నార కోటిగాడి ప్రతి అడుగు లెక్కపెడుతున్నాడు. ప్రతి కదలిక గుర్తు పెట్టుకుంటున్నాడు. నిచ్చెన ఎక్కుతూ దిగుతూ అడుసు పళ్ళాలు అందిస్తున్న కోటిగాడికి చిన్నార చిన్న బుర్రలోని పెద్ద ఆలోచనలు ఎలా అంతుపడతాయి?

నిచ్చెన గుంజలు చాంతాళ్ళతో కట్టి ఉన్నాయి. అటువంటి నిచ్చెనలు అక్కడ చాలా ఉన్నాయి. ఒక్కోవైపునుంచి ఒక్కొక్కళ్ళు అడుసు అందిస్తున్నారు. చాలసేపటినుంచి కోటిగాడొక్కడే ఒక నిచ్చెన మీద వ్రేళాడుతున్నాడు.... అదే అదననుకున్నాడు చిన్నార. అంతకు ముందే ప్లాను వేసుకువచ్చాడు. మధ్య గోడల్లోంచి కట్టిన లోపలి గుంజలమీదకెక్కాడు. జేబులోంచి బ్లేడు తీశాడు. కోటిగాడు నిచ్చెన దిగినప్పుడల్లా ఒక్కొక్క తాడే కోస్తూ వచ్చాడు. ఇంక రెండుతాళ్ళ పట్టుమీదుందనగా నెమ్మదిగా క్రిందకు దిగి వెళ్ళిపోయాడు.

మరో ఐదు నిముషాలకి చిన్నార ఊహించిన ఘోరం కన్నా ఘోరాతిఘోరం జరిగిపోయింది.

"నిచ్చెనిలా కదులుతుందేమిటా అని కోటిగాడనుకునే దానికి ముందే వాడు మూడొంతులకు పైన ఎక్కేసాడు. అడుసు పళ్ళెం వెంకడి చేతికందిస్తున్న కోటిగాడికి బాలన్సు తప్పిపోయింది. వెనక్కి విరుచుకు పడిపోబోయి చటుక్కున తండ్రి చేయి పట్టుకున్నాడు. అనుకోని ఆ ఊపుకి కొడుకు చెయ్యందుకొని ఆపలేకపోయాడు. అతడి కాళ్ళు గాలిలో తేలిపోయాయి. క్రింద

పడిపోయే కొడుకు నాపలేకపోవటం సరికదా తానూ మేడగోడల మీద నుంచి గాలిలో కెగిరిపోయాడు. ఆ పడటం పడటం క్రిందనున్న ఇనుప కమ్మీల మీద పడ్డాడు.... అంతే! రెండో కేకయినా వేయకుండా స్పృహ తప్పిపోయాడు.

అందిందనుకున్న తండ్రి చెయ్యి అందీ అందకుండా జారిపోవటంతో క్రిందకు పడిపోతున్న కోటిగాడు అడ్డం వచ్చిన కట్టుగుంజ దొరకపుచ్చుకున్నాడు. సర్కస్ రాడ్ పుచ్చుకున్నట్లు అది పట్టుకొని వ్రేలాడాడు క్రిందనుంచెవరో ఆసరా ఇచ్చేవరకు.

..... తన్ను తాను చిత్రంగా కాపాడుకున్నాడు.

ఇదంతా కనుమూసి తెరిచేంత సేపట్లో జరిగిపోయింది.

ఇదీ జరిగిన ఘోరం!

ఇదీ చిన్దొర మనస్సులో మండిన మంటలకు ఫలితం!

చిన్దొర ఒంట్లో రగిలిన మంటలు చల్లారలేదు. అవి చల్లారవు. చల్లారే వయసు కాదది. కాని, అతడు చేసిన ఘోరకృత్యం కోటిగాడి గుండెల్లో కుంపట్లు మాత్రం రగిలించింది. ఈ హోమగుండంలో ఏ పాపం ఎరుగని వెంకడు మాత్రం సమిధ అయిపోయాడు.

ఊళ్ళో వైద్య సౌకర్యం లేదు. ఉన్నా అది వెంకడిలాంటి వాళ్ళకు అందనిది. ఏదయినా సాయం చేస్తారనుకుంటే పెద్దొరగారూళ్ళో లేరు. హైద్రాబాదు కేంపెళ్ళారు.

తను తినబోయిన దెబ్బలు తన తండ్రి తిన్నాడు... కోటిగాడి గుండెలు మండిపోతున్నాయి. వాడికేం చేయాలో తెలియటం లేదు. ఎవరెలా చెపితే అలా చేస్తున్నాడు.

ఏడ్చి మొత్తుకునే తల్లి మంగళసూత్రం తాకట్టుపెట్టి డబ్బు తెచ్చిస్తే నాటుకట్లు కట్టించాడు. వెంకడు రెండు కాళ్ళూ విరిగి ముక్కలయ్యాయి. ఒక కాలుకొక ఎముకే విరిగింది. రెండో కాలుకొక ఎముకే మిగిలింది.... ముక్క ముక్కలుగా విచ్చిపోయింది.

పట్నం నుంచి పెద్దొరగారు దయచేసే సరికి వెంకడు చావు బతుకుల మధ్య ఉన్నాడు. దయగల పెద్దొరగారు పెద్దాసుపత్రికి పేరు చెప్పి పంపించారు.... పంపించి నాల్గు రోజులయింది.

జరిగింది పెద్దొరకి చెప్పటానికి కోటిగాడు వచ్చాడు.... వచ్చినవాడొట్టి కోటిగాడిలా రాలేదు. ధర్మ ప్రభువుల దివాణంలో కూలిబానిసలా రాలేదు. ఆసుపత్రికి పంపించి పోయే ప్రాణం మిగిల్చినందుకు దొరకి దణ్ణాలు పెట్టడానికి రాలేదు. ఒక్క కాలు పోయినా రెండో కాలుతో మిగిలిన వెంకడి తరపున "థేంక్సు" చెప్పడానికి రాలేదు. అన్యాయం ఎలా జరిగిందో కూపీ తీయించమని డిమాండు చేయటానికి రాలేదు. ఇంత ఘోరం చేసినవాళ్ళను దొరకపుచ్చుకొని లాకప్పులో పెట్టించమని చెప్పటానికి రాలేదు.

జరిగిందాన్ని జరగనట్లు చేయటం ఎవరివల్ల కాదని తెలిసే వచ్చాడు. ఘోరం చేసిందెవరయినా వాళ్ళకు శిక్షేసినంత మాత్రాన తన తండ్రికి కాలు మొలిచి రాదని తెలిసే వచ్చాడు. నిన్నటి చెడ్డ తల్చుకునే కన్న ఈవేల్టి మంచి పెంచుకోవడం మానవుడి లక్షణం అని తెలిసే

వచ్చాడు.

కళ్ళముందు కన్నతండ్రి అవిటి వాడయిపోయినందుక్కు ఏదో తెలియని కసితో గుండెలు మండిపోతున్నా..... మంచిని చుట్టూ కోటలా పేర్చుకొని తన మనస్సుని కాల్చి వేయకుండా కాపాడుకుంటూ మరీ వచ్చాడు. సత్యం మాస్టారు చెప్పిన చల్లని కబురు గుండెల్లో పొంగించుకొని మరీ వచ్చాడు. పెద్దొర విని ఏదో న్యాయం చేస్తాడని కొండంత ఆశపెట్టుకొని మరీ వచ్చాడు.

కోటిగాడు ఆపూట దొరగారి సాయంత్రం 'సప్పర్' కూరకోసం కట్టి సిద్ధం చేసిన కోడిపుంజులా నేలమీద కూలబడి కూర్చున్నాడు. దొరగారి పొలం దున్ని దున్ని ముసలిదై పోయిన దుక్కిటెద్దులా వాడి మెడలు వంగిపోయున్నాయి. ఏళ్ళ తరబడి ఈతలీని తన రక్తమాంసాలన్నీ క్షీరధారలుచేసి ఈనాడు వొట్టిపోయిన దొరగారి పడమటావులా వాడి డొక్కలు ఎండిపోయున్నాయి.

అటువంటి కోటిగాడివైపు కార్లో వెళ్ళేవాడు నేలమీద నడిచేవాణ్ణి చూసినట్లు చూశాడు చుక్కయ్య. నేతి బిస్కట్లు తినే దొరగారి బొచ్చుకుక్కలా లేడు చుక్కయ్య. దొరగారి పనిమనిషి మాలక్ష్మి గోడమీద నుంచి విసిరేసే ఎంగిలాకులు నాక్కుతినే ఊరకుక్కలా ఉన్నాడు!

దొర తీరుబడి చేసుకొని వచ్చాడు. కోటిగాడు పైకిలేచి వొంగి దణ్ణాలు పెట్టాడు.

"ఏఁవిరా! ఏఁవయింది?" రోజూ సిగరెట్లు కాల్చే దొర ఆపూట సరదాగా చుట్ట కాలుస్తూ పొగమధ్య కళ్ళు చికిలిస్తూ అడిగాడు.

కోటిగాడు చెప్పాడు. తండ్రి అవిటివాడయిపోయాడని చెప్పాడు. మరో నెల్లాళ్ళు హాస్పిటల్లో పడుండాలని చెప్పాడు. ఆ తర్వాత ఏ పనికీ పనికి రాడని డాక్టర్లు చెప్పిన వైనమూ చెప్పాడు.

దొర మాట్లాడలేదు. దొర మాట్లాడతాడని కూడా కోటిగాడనుకోలేదు.

దొర మాట్లాడాలి. దొర మాట్లాడితేగాని జరగాల్సింది జరగదు. సత్యం మాస్టారు చెప్పిన న్యాయం జరగదు.

అందుకనే కోటిగాడు దొరని మాట్లాడించాడు. "నాయం సెయ్యండి దొరా!" అన్నాడు.

"నువ్వు మా కమతంలోనే పెర్మినెంటుగా ఉండిపోరా!" అన్నాడు దొర గ్రేస్‌గా,

"నా గురించి కాద్దొరా! మా అయ్య మాట...."

ఏమిటన్నట్టు చూశాడు దొర. పులిరాజు వదిలిపెట్టాక బొమికలు పీక్కుతినే గోతికాడి నక్కలాంటి దొరగారి గుమాస్తా గుర్నాధం దొరచూపు కర్థం చెప్పాడు.

"పాపం మీ నాయన ఏం చేయలేదు కదరా! మరి నువ్వు కాకపోతే, ఎవరు కన్పెట్టుంటారు. మీ తమ్ముళ్ళు, చెల్లెళ్ళు ఇంకా చిన్నాళ్ళే కదా మరి?"

"నా మాట్సరేబాబూ, మా వోల్లందర్కీ నానెలాగా ఉండాను. కాని ఇల్లుకోపెడకూలి పోయినట్లే కదా! ఒంటి సేత్తో ఎంతని సేయగల్ను? అందుకే, మా అయ్యకి బత్తెం ఇప్పించమని దొరగోర్కి మన్విసేస్కుంటున్నాను."

"ఇవ్వకుండ ఎలాగుంటారు? ఈ నెల కూలి పూర్తిగా ఇచ్చేస్తార్లే!" తానే ఆ వుపకారం చేసేస్తున్నట్లు మాట్లాడాడు గుర్నాథం.

"అంతేనా బాబూ!" వడిశెల దెబ్బ తగిలి రెక్కలు విరిగి నేలకూలిన పిట్టలా మూలిగాడు కోటిగాడు.

"మరింకేం కావాలంటావ్?" దొరగారి కన్న ఎక్కువ ఆశ్చర్యపోయారు గుర్నాధమూ, చుక్కయ్య.

"ఇంతప్పట్నించి దొరగారి కొట్టంలో ఎండన్క వానన్క మా అయ్య పన్జేశాడు. తాళ్ళతోటి తూరుప్పొలం బాగుసేసి ఒంటిచేత్తో సాక్కు తీస్కొచ్చాడు. దొరగోరి మేడ గోడల మీంచి కూలిపోయి అవిటోడయిపోయేదాకా ఏం పని సెపితే అదల్లా సేశాడు. కాళ్ళే ఉంటే ఇంకా సానాకాలం పన్జేసే వోడే కదా బాబూ!"

"ఏమిటది బాబూ అన్యాయం! వాడేదో దేశానికి అరిష్టం తెచ్చేలా ఉన్నాడు" అన్నట్లు గుర్నాధం దొరవైపు చూశాడు.

"కాంపెన్సేషన్ అడుగుతున్నాడన్న మాట...." అన్నాడు దొర ఏ మాత్రం తొణక్కుండా.

"ఓర్నీ అసాధ్యం కూల, మేడమీంచి మీ అయ్య పడిపోటం దొరగారి తప్పంటావా? ఇదేమన్నా రైలు ప్రమాదం అనుకున్నావా? గవర్నమెంటునుంచి డబ్బుచ్చుకున్నట్లు పుచ్చుకోడానికి?"

"తప్పెవర్దయినా దెబ్బతిన్నోళ్ళని గవర్నమెంటు కాయిటం లేదా బాబూ! రైల్లో ఎళ్ళే పేసింజర్కయితే కొన్నొందలే ఇత్తున్నారు... మరా రైల్లో పన్జేసేవోడికయితే కొన్ని వేలే ఇత్తారు!...."

"దొరగారూ! వీడేదో పెద్దెత్తునే వచ్చినట్టున్నాడు. ఆ పైన...." అని గొణిగాడు గుర్నాధం.

"ష్!...." అని మందలించాడు దొర. "వాడు చెప్పదల్చుకుంది చెప్పనీ!"

"నాన్సెప్పేందు కింకేంవుంది దొరా! తంవరు నాయం సెయ్యండని సెప్పటాన్కి నానొచ్చినా."

"నీకే పుట్టిందా ఈ బుద్ధి? ఇంకెవరయినా చెప్పి పెట్టారా?.... అమ్మమ్మ ఎంత అసాధ్యుడివిరా!" అప్పుడే కోటిగాడి చేతుల్లోకి వేలురాలుతున్నట్లు కుతకుతలాడిపోయాడు గుర్నాధం.

దొరకిలా సంభాషణ సాగటం ముఖ్యంగా తన సమక్షంలో - ఇష్టం లేదు. "నువ్వుండవయ్యా! వాడేదో చెప్పుకొని ఏడుస్తున్నాడు. ముందు నీ గోలేమిటి?...." అని గురునాధాన్ని షోగ్గా కసురుకొని "అలాగే లేరా! నేనాలోచించి అంతా చేస్తాగా! ముందు మీ అయ్య సంగతి జాగ్రత్తగా చూడు. ఇంటో పిల్లా జెల్లాకి తిండి కుదిరేలా చూడు. అందాకా ఖర్చులకో వందిస్తాను తీస్కుపో!" అని గుర్నాధం వైపు కళ్ళెగరేశాడు దొర.

"సిత్తం దొరా! పిల్లల్నందర్నీ మా అప్ప తీస్కెల్లింది. తంవ దయుంటే మేవంతా ఓ గట్టు నడిపోతాం.... " ఆ మాత్రానికే పొంగి పోయాడు కోటిగాడు.

వేలిముద్రవేసి దొరకి దణ్ణంపెట్టి పోదామని నిలబడిన కోటిగాడి చెవుల్లో ఆయన మాటలు

మంటలు రేపే తూటాల్లా వినిపించాయి.

"ఆ ముసలెద్దుని, ఒట్టావుని ఎన్నాళ్ళని ఊర్కినే మేపుతాం? పీర్‌సాయిబునొచ్చి తోల్కుపొమ్మను...."

"సిత్తం" అన్నాడే కాని చుక్కయ్య కూడా గతుక్కుమన్నాడు దొర హుకుమ్‌కి.

"మరంతే! రిటైరయిపోయాక మనిషయినా, జంతువయినా, ఎవరయినా పోవాల్సిందే!" అని విడమర్చి చెప్పాడు... రిటైరయినాక తన గతి గురించి బొత్తిగా ఊహించుకోలేని గుర్నాధం... ఎందుకూ పన్కిరాకుండా పోవటమే దొరగారి లెక్కలో రిటైరయిపోవటం అని ఇంకా అర్థం చేసుకోలేకపోతున్న గుర్నాధం!

కోటిగాడు వెళ్ళిపోయాడు. దొరకి దణ్ణం పెట్టడం మర్చిపోకుండా వెళ్ళిపోయాడు. మనిషిలోని మంచికి మరో మనిషిచ్చే విలువిదేనా అని గిలగిలలాడుతూ వెళ్ళిపోయాడు. దొర తన మనస్సు చెప్పకనే అంతా చేప్పేశాడా అని అనుకుంటూ వెళ్ళిపోయాడు.

అందుకు దాఖలాగా ఆ రాత్రే కోటిగాడి మీద నిఘాకి చుక్కయ్యని పంపాడు దొర. చుక్కయ్య దొరగారి దేశవాళీ "ఘూర్ఖా" మాత్రమే కాదు... నాటు సరుకు "గూఢచారి" కూడాను. .... కోటిగాడి బుర్రలో న్యాయమైన క్రొత్త ఆలోచనలకి మూలకారకుడెవరో చుక్కయ్య తెల్సుకున్నాడు.

అంతేకాదు. కోటిగాడు విన్న ప్రతిమాటా తను విన్నాడు. కోటిగాడు తనకోసం విన్నాడు. తనలాంటి వాళ్ళకోసం విన్నాడు. చుక్కయ్య దొరకోసం విన్నాడు. దొరలకమ్ముడుపోయిన వాడిలా విన్నాడు.

ఒంటరివాడు, ఎవరూ లేనివాడు, అందరూ తనవాళ్ళనుకునే వాడు - అటువంటి సత్యం మాస్టారు క్రొత్త క్రొత్త మాటలు చాలా చెప్పాడు.

'డబ్బున్నోళ్ళ డాబుసరి కబుర్లు పోయేకాలం వచ్చిందన్నాడు. గవర్నమెంటు దొరలయినా, ప్రైవేటు దొరలయినా పన్జేయించుకున్నందుకు తగిన పైసలివ్వాలన్నాడు. పనిచేస్తూ చేస్తూ ప్రాణాలు పోగొట్టుకున్నా, ప్రమాదం జరిగినా తగినంత ప్రతిఫలం ముట్టజెప్పి తీరాలన్నాడు. 'ఎవ్వరూ యివ్వటం లేదుగా' - అన్నది పాత కబురు. ఇప్పుడు 'అందరూ ఇచ్చి తీరాలన్నది - క్రొత్త సంగతి' అని చెప్పాడు. అడిగినా ఇవ్వని ఖామందులుంటే ఎలా చెప్పి పుచ్చుకోవాలో తెల్సుకోవాలన్నాడు. ఇవేళ నీ అయ్యకయింది. రేపు నీకే అవుతుంది. అక్కడ పన్జేసే ఎవడి కయినా కావచ్చన్నాడు. ఇలా కూలాళ్ళ రక్తంతో కట్టిన మేడలన్నీ ఎంతోకాలం కూలిపోకుండా ఉండాలని మరికొందరు కూలాళ్ళు కాపలా ఉన్నారన్నాడు. ఇలా కూలాళ్ళ శవాలమీద దొరల భవనాలు నిలిచాయన్నాడు!

'ఇప్పుడా రోజులు పోయాయి. చేసిన పనికి కూలి ముట్టకపోతే సమ్మెల్జేయాలి. సత్యాగ్రహం చేయాలి. అప్పటికీ దొరలు దిగిరాకపోతే కట్టకట్టుకొని వెళ్ళి వాళ్ళ కళ్ళు నింగినుంచి నేలకి దించాలి. అలా కాకపోతే, మీరెల్లకాలం ఇలాగే కుక్కల్లా బ్రతుకుతారు. పురుగుల్లా

చచ్చిపోతారు... కనుక, సలహా చెప్పటాన్కి నేనున్నాను. మనుషుల్ని కట్టుకోటాన్కి నువ్వున్నావు. మనమంతాకల్సి ఒక త్రాటిమీద నిలిస్తే.....'

సత్యంగారి ఉపన్యాసాలు కోటిగాడి దిగజారిన మనస్సు ఉత్తేజపరచటానికి మాత్రమే పనికి వచ్చాయి. సత్యం మాస్టారి బంగారు కలలు కోటిగాడికి పంచి యిచ్చి తాత్కాలికంగా సుఖ పెట్టడానికే పనికి వచ్చాయి.

పడగనీడలో తన మనస్సు విప్పి చెప్పుకున్నాడని.... తనతోటి మనుషులకోసం తానావేదన పడిపోతున్నాడేకాని, తనమీదకి ముంచుకు వచ్చే ఉప్పెనలంటూ ఉన్నాయని అతనికాక్షణంలో బొత్తిగా తెలియదు!

అప్ప యింట తోడబుట్టిన వాళ్ళు, హాస్పిటల్లో తండ్రి, అతని కాసరాగా తల్లి అంతా తలొకమూల అయిపోగా ఒంటరివాడయిన కోటిగాడు – ఒంటరి మాస్టారి కబుర్లువింటూ ఆయనకి జంటగా ఆ పూట అక్కడే ఉండిపోయాడు!

మాస్టారు పెట్టిన అన్నం తిన్నాడు. మాస్టారు పుట్టించిన ఆశలు పెంచుకున్నాడు. తెల్లవారితే లోకమంతా పండగే అనుకుంటూ... మాస్టారితో పాటు కమ్మని కలలో కొరిగిపోయాడు కోటిగాడు.

కాని, ఆ రేయి తెల్లవారలేదు!

సత్యం మాస్టారు, కోటిగాడు అర్థరాత్రి వరకు కబుర్లు చెప్పుకొని అలసిసొలసి ఒళ్ళు తెలియకుండా నిద్రపోతున్నారు. వాళ్ళ వొళ్ళు తెలిసేసరికి వాళ్ళు పడుకున్న తాటాకింటిని మంటలు చుట్టుముట్టాయి.

మంటలు!..... మంటలు!.....

గుండెల్లో ఇంకా చల్లారనే లేదు మంటలు. ఇప్పుడు కోటిగాడి చుట్టూ నాలుకలు చాచిన అగిడి మంటలు. న్యాయం చెయ్యమని అడిగిన కోటిగాడికి జవాబులై వచ్చిన గొప్ప గొప్ప మంటలు.

మంటలు! మంటలు!

కోటిగాడనే తోటి మనిషికి మాట సాయంగా నిలిచినందుకు సత్యం మాస్టారి చుట్టూ మంటలు. న్యాయమంటే ఇలా ఉండాలని చెప్పినందుకు ఒంటరి మాస్టారి ఒళ్ళంతా మంటలు మంటలు!

నీళ్ళకోసం పరిగెత్తిన నలుగురి రాకకోసం తెల్ల మొహాలు వేసుకు చూస్తున్న పాతిక మందితోటి మనుషుల కళ్ళల్లో వెలుగుతూ వాళ్ళకు కనిపించని మంటలు మంటలు!.... మనుషుల కొంపల మధ్యలోనే వల్లకాడయిపోతున్న సత్యాన్ని, న్యాయాన్ని బూడిద చేస్తున్న మంటలు మంటలు!

●